

# అటునించి కొట్టుకురండి

చింతపల్లి అడవులన్నా చిమ్మచీకటన్నా చెప్పలేని భయం ఏర్పడ్డది. ఆ అడవుల్లో చిరతపులులు, బెబ్బులులు, నెత్తురుతాగే సింహాలు. సింహాల్ని పులుల్ని మించిన చెంచులు. పట్టపగలే దోపిడీలు! అడవంతా నెత్తురుమడుగులు. అడవిదాటి అడంగు చేరిన మనిషి ఈ మధ్య కన్పించలేదు. అందరి గుండెల్లో

చెంచు భయం! బుర్ర మీసాల్తో, నెత్తుటి కళ్ళతో మానుల్లాంటి చెంచులు గండ్రగొడ్డళ్ళతో స్వైరవిహారం చేస్తున్నారు. రాజ్యమంతా అల్లకల్లోలంగా వుంది.

హజారంలో మూడు గంటలుకొట్టినా కోటలో వేంకటాద్రి నాయుడుకి నిద్ర పట్టలేదు. "తన పాలనలో తన అధికారాన్ని ధిక్కరించినవారు లేరే! ఈ అడవిజాతి వాళ్ళని అణచలేక పోతున్నానేమి?" అని కలవరపడ్డాడు నాయుడు. నూరుమంది సైన్యాన్ని ఆయుధాలతో పంపితే, పుట్టచాటునుంచీ, చెట్టుచాటునుంచీ చెంచులు వాళ్ళమీదికి దొంగచాటుగా దూకారు. బాణాలు గుండెల్లో నాటుకోగా బల్లాలకు తలలు గుచ్చారు. అయినవాళ్ళు పోయారు. ఆయుధాలు పోయాయి. బతికి బైటపడ్డ ఒక్కడూ కబురు చెప్పి నాయుడి కాళ్ళముందు కన్నుమూశాడు.

నాయుడు ఉడికిపోయాడు. కళ్ళు నిప్పులయ్యాయి. ఇది జరిగిన మర్నాడే పసుపు కుంకుమల్తో పచ్చ తోరణాలతో, మంగళ వాద్యాలతో మరిదయ్య కుటుంబం పెళ్ళికి తరలి వెళ్ళింది. దోవ మధ్యలో చెంచులు విరుచుకు పడ్డారు. తోరణాలు తెగిపోయాయి. కుంకుమలు రాలిపోయాయి. నెత్తురు వరదలైంది. పెళ్ళి పల్లకాడైంది. పదిమంది పెళ్ళి పెద్దల శవాలు ఒకేసారి స్మశానానికి తీసుకెళ్తుంటే వూరు వూరంతా గొల్లుమంది. పసుపు కుంకుమలు పోగొట్టుకున్న ఇల్లాళ్ళని చూసిన ఆడకూతుళ్ళ గుండెలు చెరువయ్యాయి. 'నాయుడి పాలనలో ఇంత అరాచకమా?' అని కుమిలిపోయింది ప్రజ.

నాయుడు నిలవలేకపోయాడు. వీరుల్లా స్వేచ్ఛగా తిరగవలసిన ప్రజ బితుకుబితుకుమంటూ బతుకుతుంటే సహించలేకపోయాడు. తెలతెల వారుతూనే సభ పెట్టించాడు. పాపయారాధ్యులవారు అనుష్ఠానం హడావిడిగా పూర్తిచేసుకొని వచ్చారు. శాకమూరి సేనాధిపతినే కాక వీరసింగు, రామసింగు మొదలయిన హరిజనుల్ని, కోటోజీ, రామోజీ మొదలయిన మరాఠా సర్దారుల్ని రప్పించాడు.

సభ నిశ్శబ్దంగా వుంది.

అందరూ నాయుడు ముఖమే చూస్తున్నారు. నాయుడు చూపులు ఎక్కడో వున్నాయి. ఆలోచనలు తెగడం లేదు. ముఖం ఎర్రబారింది. పౌరుషం కళ్ళలోకి తన్నింది. సర్దారుల్ని, సేనాపతుల్ని చూస్తూ అన్నాడు నాయుడు "మనని నమ్ముకున్న వాళ్ళ మాన, ప్రాణాలకు భద్రత లేకపోతే మనమెందుకు?" సర్దారులు ముఖాలు ముఖాలు చూసుకున్నారు. మళ్ళీ అన్నాడు నాయుడు "చెంచుల్ని అణచగల మొనగాడే లేడా మనలో?" అని.

సభనుంచి సమాధానం లేదు.

"చెప్పండి" గద్దించాడు నాయుడు.

కోటోజీ ముందుకొచ్చి వినయంగా తలఒంచి పలికాడు. "అడవిలో చెంచుల్ని జయించడం కష్టం ప్రభూ."

"అయితే మార్గం" అన్నాడు నాయుడు.

పాపయారాధ్యుడు కలిగించుకుని "మొసలిని ఒడ్డుకు లాగాలి" అన్నాడు. నాయుడుకి అర్థమైంది. సభను ముగించి నర్సోజీతో ఏకాంతమందిరానికి నడిచి వెళ్ళాడు. మంత్రాంగం సిద్ధపరచి భుజంగరావును చెంచుల దగ్గరికి రాయబారిగా పంపించాడు.

మర్నాడు-

పురప్రముఖులందరూ వుండగా సభ ఏర్పాటయింది. చెంచునాయకుడు జెల్లా కృష్ణా నాయకుడు సభలో ప్రవేశిస్తుంటే కాలయముడు నేలమీద అడుగు పెట్టినట్లుంది. చెంచుదొర సరాసరి నాయుడు దగ్గిరకొచ్చి వందనం చేసి "దొరా! మీ సేవకుడ్నన్నాడు." నాయుడు కళ్ళలో కోపం పొంగింది. "నాసేవకులు నా బిడ్డల్ని దోచుకుంటార్రా? నేను పగవారి తలలు తెగకొట్టాను కాని, తన వారిని చంపుకోలేదే! నా పాలనలో అరాచకమా?" అన్నాడు.

"బుడతలు తెలియక చేసిన తప్పుని కాసుకోండయ్యా! ప్రభువులు మా మీద

కత్తెత్తకండయ్యో"అంటూ ప్రాధేయపడ్డాడు చెంచు నాయకుడు. నాయుడు ఆలోచించి అన్నాడు"క్షమించాం. మీ దోపిడీలు మానేస్తారా?" "మానేస్తాం దొరా! మాకు కూడు దొరికే దోవ చూపించు దొరా" అని వేడుకున్నాడు చెంచు నాయకుడు.

నాయుడు మరికొంత ఆలోచించి "నా సైన్యంలో చేరం డన్నాడు." ముసలి చెంచు పొంగిపోయాడు. సరేనని ఒప్పుకున్నాడు.

సభ ముగిసింది.

ఆ మర్నాడే చెంచులు నాయుడి సైన్యంలో భాగమయ్యారు. గుట్టలనున్న జనం పట్నాల కొచ్చారు. కొలువు చేసుకుంటూ కడుపునిండా తింటూ హాయి మరిగారు, ఆ హాయి కొద్ది కాలానికే విసుగనిపించింది వారికి. చెట్లు పాకి, ఏరు ఈది, బల్లాల యుద్ధంచేసి, బాణాల తెగపాడిచి పరుగు పరుగున తిరిగే జాతికి పరుపుమీద పడుకోవడం మహాబాధగా తోచింది. కొంత మంది చెంచు కుర్రలు చిన్నచిన్న దొంగతనాలు మొదలుపెట్టారు. మరి కొందరు వీలున్నప్పుడు అడవి కెళ్ళి మళ్ళీ దోపిడీలు సాగించారు. నాయుడు సేనాపతులద్వారా చెప్పించి చూశాడు. ప్రయోజనం కనిపించలేదు. రోజురోజుకీ దారుణాలు పెరిగి పోతున్నాయి. అడవిలో వున్న ఆపదని అంతఃపురంలో పెట్టుకున్నట్టయింది నాయుడికి.

సేనానులతో మంతనాలు జరిపాడు. చెంచుల చేతుల్లో ఆయుధాలు వుండగా వాళ్ళు లొంగడం కష్టం అన్నారు. ఇంటి శత్రువుకి మరణమే తగిన శిక్ష అన్నారు. మాయోపాయంతో మట్టు పెట్టాలని నిర్ణయించారు. ఆ మూడవ రోజు నాయుడు చెంచుల్నందర్నీ విందుకు పిలిచాడు. ఆయుధాలు దూరంగా పెట్టి ఆనందంగా భోజనాలు చేశారు. అదే ఆఖరి భోజనమని వాళ్ళకు తెలీదు. విందునుంచి లేచేంతలో సైన్యం విరుచుకుపడి చెంచుల్ని బంధించింది. మోకుల్తో కట్టి తోపులోకి తీసుకెళ్ళి వరుసగా నిలుచోబెట్టారు చెంచుల్ని. అరదరి తలలూ ఏకకాలంలో నరకబోతున్నారన్న వార్త ఊరంతా గుప్పుమంది. వరుసలో

ముందు చెంచునాయకుడు జెల్లా కృష్ణ తలొంచుకుని నిలుచున్నాడు. తోపులో మూగినజనాన్ని, ఎదురుగా వున్న నాయుడ్ని చూసి అన్నాడు "దొరా! కన్న బిడ్డల కుత్తుకలు కోస్తావా?"

"మీరు తల్లి రొమ్ముగుద్దిన వాళ్ళురా - ఈ గడ్డన తమ్ముళ్ళ నెత్తురు పారించిన వాళ్ళురా"

"ఈ తప్పు కాసి మా బతుక నిలపలేవా దొరా."

"నూటొక్క తప్పు కాశానురా? తల్లికి ద్రోహం చేసినవాడి తల తెగిపోవలసిందే. నరకండి" అని ఆజ్ఞాపించాడు నాయుడు.

వరుసగా వున్న చెంచుల తలలు నరకడానికి గండ్రగొడ్డళ్ళు పైకి లేచాయి.

మొదట నిలుచున్న చెంచు నాయకుడి దగ్గరికి తలారు లొచ్చారు. చెంచునాయకుడు "ఒక్క కోరిక దొరా! అటునుంచి కొట్టుకురా దొరా" అన్నాడు.

అటునుంచి నరుక్కుంటూ వస్తే కొంతమంది మరణించిన తరువాతనైనా నాయుడికి జాలి కలిగి వధ ఆపేస్తాడేమో ప్రాణం దక్కుతుందని అతని ఊహ.

నాయుడు సరేనన్నాడు.

అటునుంచే కొట్టమన్నాడు.

అటునుంచి కొట్టుకొచ్చినా, ఇటునుంచి కొట్టుకెళ్ళినా అధికారం నిర్ణయించిన ధర్మం ప్రకారం అందరి తలలు నేలకొరిగాయి.

ఐతే చెంచు నాయకుడు తనవారు తన కళ్ళముందే నేలకొరగడం చూడవలసిన దురదృష్టానికి నోచుకున్నాడు.

('అటునుంచి కొట్టుకురమ్మన్నారు' అన్న సామెత వేంకటాద్రినాయుడు కాలంనుంచే ప్రచారంలోకి వచ్చింది.)

(చూడుడు : చాటు పద్యమణి మంజరి.)*